# సాయం

**బాగా పాడైపోయిన కరణాల వాడపిల్లి పెంకుటింటి మీద ఒత్తుగా పెరిగిన పచ్చగడ్డి అసలు పెంకుల్ని కనబడ నియ్యటం లేదు. నల్లమిల్లి భాస్కర్రెడ్డిగారింటిముందు నులకమంచం మీద సొట్టలు పడ్డ సీనారేకు పళ్ళెంలో చల్లమిరపకాయల్ని ఎండ బెడితే జామ్మని వాలి ఓ మిరపకాయిని ముక్కున కరుచుకెళ్ళిన కాకి కొంత దూరమెళ్ళాకా కారంగా ఉండటంతో వదిలేసింది. కొత్త సీవండి గిన్నెల్ని సైకిలు హేండిలు బారుకీ, వెనకాల కట్టిన పెద్ద గంపకీ వేలాడదీసుకుంటా ఒకడు ఆవీధిలో కొస్తుంటే, నువ్వు పప్పుజీళ్ళకి పాత ఇనుం ముక్కలూ ఖాళీసీసాలూ కొనుక్కునేవాడు వాడికి ఎదురయ్యేడు. ఉన్నట్టుండి ఆ ఊటలంక వీధంతా పిఠాపురం నూర్జహాను సెంటు వాసనతో నిండిపోయింది.**

బాబులురెడ్డి నడుస్తున్నాడు వీధిలోంచి.

చాలా అందగాడు బాబులురెడ్డి. బలమైన కండల్తో పొడుగ్గా వుంటాడు. ఒత్తుగా వుండే పెద్ద పెద్ద కనుబొమ్మలు వంకీలజుట్టుని పౌరాణిక నాటలాడేవాడిలాగా బాగా పెంచి నిమ్మనూని రాసి పైకెగదువ్వుతాడు. సెంటులో ముంచిన చిన్న దూదిఉండని చెవిపైన ఒంపులో దూరుస్తాడు. జుట్టుకున్న నూని చొక్కాకాలరుకి అంటుకోకుండా జేబురుమాలు మడతెట్టి కాలరు మీద దూరుస్తాడు. మెత్తగా వుండే జింకచర్మంతో కుట్టిన చెప్పులు తొడుగుతాడు.

తను ఇష్టపడ్డ ఏ ఆడదాని వేపైనా చూశాడంటే ఆ మనిషి రాత్రి తను చెప్పిన చోటుకి వచ్చేయ్యాల్సిందే. ఆ చూపులో ఒక శాసనం వుంటదట. అలా అని ఫలానా మనిషిని ఇబ్బంది పెట్టాడూ, బలవంతపెట్టాడూ బలత్కారం చేశాడూ లాంటి కథ ఏ ఒక్కటీ లేదు బాబులురెడ్డి మీద, మోజుల తోటలో కాపరాలుండే ఆడోళ్ళు బయటికి చెప్పుకోరుగానీ ఒక విషయం మాత్రం నిజం. ఆడమనిషి దగ్గర కెళితే ఏ మంత్రమేస్తాడో ఏం చేస్తాడో తెలీదుగానీ గంటకి తక్కువ వుండడట. ఒకసారి ఆ రుచి మరిగిన మనిషి మళ్ళీ బాబులుతో గడిపేరోజు ఎప్పుడొస్తదా అని ఎదురు చూస్తుంటదంట.

ఊబలంక నించొచ్చిన మా సుబ్బులుబావని పలకరిద్దావని మా ఇంటికొచ్చిన బాబులురెడ్డిని గడప దగ్గర నిలబడి చూస్తున్నాను. మా బావా బాబుల్రెడ్డీ జట్టు.

దొడ్లో ఉన్న చిన్నంగి కొబ్బరిమొక్కల కింద కూర్చున్న వాళ్ళిద్దరూ మాటాడుకుంటుంటే వింటున్నాను. చాలాసేపు సీక్రేటుగా మాటాడుకున్న వాళ్ళ మాటల్లోంచి ఎవరికీ తెలీని బాబులురెడ్డి సొంతస్టోరీ ఒకటి బయటికొచ్చింది

లాకుల కిందున్న కాకోరిసావరంలో లక్ష్మణదాసుగారమ్మాయి శ్యామలని ఇష్టపడు తున్నాడట బాబులురెడ్డి. అది ఇంతా అంతా ఇష్టం గాదంట.

"అదేంట్రా ఆడోళ్ళంతా నీకోసం పడిగాపులు గాస్తుంటే నువ్వేంటి ఆ మనిషిని?" అడిగాడు మా ఊబలంకసుబ్బులుబావ.



"ఆ శ్యామల్ని నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" చాలా నిబ్బరంగా అన్నాడు బాబులురెడ్డి.

"మరి కల్సి చెప్పలేకపోయావా?"

"మొన్న తలుపులమ్మ తీర్థంలో కల్సినపుడు చెప్పేను" అన్నాడు బాబులురెడ్డి.

"ఏవందేటి?" అడిగాడు మాబావ.


"కరెంటు కొట్టినట్టు నవ్వేసి పళ్ళివ్వడానికి అమ్మోరి గుళ్ళో కెళ్ళిపోయింది" చెప్పాడు బాబులురెడ్డి.

"అవునంటదా? కాదంటదా అసలేవంటది?"

"అదే ఇంకా అర్థం గాటం లేదు".

"మరి సాయంత్రం వెల్దామా ఆ కాకోరిసావరం సైడు?"

సందు మొసం నించి వాళ్ళ ఆమాటలు డొప్పచెవుల్తో వింటున్న నా వీపు మీద దభాల్మని పడింది మా రంగమావ అరచెయ్యి.



"ఏంట్రా ఆళ్ళేదో మాటాడుకుంటుంటే నువ్వేం జేత్తన్నావిక్కడ? మాసిపెట్లో బట్టలు బోల్డు పడున్నాయి. సాకలీరమ్మని తీసుకురమ్మని చెప్పేనా?" అనేసి జుట్టు పట్టుకుని ఇంకో రెండు దభదభా బాది వీధిలో కిసిరేసేడు నన్ను.

ఎన్నో తరాలనించి మా ఇంటి బట్టలు ఈరమ్మ వాళ్ళ కుటుంబమే ఉతుకుతుంది. అలా ఉతికినందుకు డబ్బులు ఇవ్వం. సంవత్సరానికి ఇన్ని బస్తాలనీ ఒడ్లు కొలుస్తాం.

ముప్పైదాటిపోయినా, నాజూగ్గా వుండే ఈరమ్మ మొగుడ్నొదిలేసింది. కృశశరీరం. సుర్మా పెట్టుకున్న కళ్ళతో కైపుగా చూస్తది. నూరుకౌంటు నేత చీరని పిక్కలదాకా లాగి బిగించి మరీ కడద్ది. కింద పెదివి చివర్ని పై పంటితో గడుసుగా నొక్కి మరీ మాటాడే ఈరమ్మ మాంచి మాటకారి. ఊరి స్మశానాన్ని ఆన్చి ఉన్న చెరువులో బట్టలు బండ కేసి బాదేటైములో పాటలు పాడద్ది. ఆ మనిషి నోటమ్మటొచ్చే ఆ పాటలు బయటెక్కడా వినబడవు. "ఉట్టప్పుడెందుకు పాడవే?" అనడిగితే "అలా పాడుకుంటూ పని చేసుకుంటూ పోతే అలుపూ సొలుపూ ఉండదు. నా ఎదవన్నరగొంతుకుతో ఉట్టప్పుడెందుకు బాబు ఆ గుడిసేటి పాటలు?" అని కొంటెగా నవ్వేస్తది.

ఈరమ్మ వాళ్లింటికెళ్ళేసరికి వీధి తలుపులేసున్నాయి. రేవులోకిగాని వెళ్ళిందేమో అనుకుని వెనక్కి తిరగబోతుంటేమాటలివిపిస్తున్నాయి లోపల్నుంచి. కిటికీ రెక్కతోసి తొంగిచూసిన నా గుప్పెడు గుండెకాయ గిజగిజలాడి పోయింది. ముక్కులోంచి వేడిగాలి బుస్సుమంటా బయటికొచ్చింది. కాళ్ళలో ఒకటే ఒణుకు, పంట్లాంలోంచి ఉచ్చబొట్లు బొట్లుగా కింద పడతంది.

లోపల నులకమంచం మీద చీరా జాకెట్టు లేకుండా రంగు వెలిసిన ఎర్రలంగాతో బోర్లా పడుకునుంది ఈరమ్మ. పక్కనే కూర్చున్న ఎరకలి మాసరమ్మ గిన్నిలో (నిమ్మ నూని) నాపరాయిలాంటి ఈరమ్మ వీపు మీద దబ్బిళించి రుద్దుతుంటే, అదోరకమైన బాధతో మూలుగుతా ''నువ్విలా మర్దనా చేస్తుంటే చాలా సైతిగా ఉందే'' అంటుంది ఈరమ్మ.

''నీ నడుం జారిపోయిందే ఓ మూడ్నెల్లపాటు రేవు కెళ్లలేవు తెల్సా?'' మర్దనా చేస్తా అంది మాసరమ్మ.

''అలా భయపెట్టకే నీ మందుతో కూసింతసేపు మర్దనా చేసి గుణం కనిపించేలాగ చెయ్యి... అయినా ఇంతపని చేస్తాడనుకోలేదా మనిషి''.

''ఏ మనిషి?''.

''ఇంకే మనిషి..ఆ మనిషే బాబులురెడ్డి'' మళ్ళీ పిప్పరమెంటు బిళ్ళని చప్పరించి రసాన్ని లోపలికి లాక్కుంటున్నట్టు తియ్యగా అదోలాగ మూలుగుతా అంది ఈరమ్మ.

''ఏం జరిగిందేంటి?'' కతప్పుడే అర్థమైపోవడంతో కొంటెగా అడిగింది మాసరమ్మ.

నడుం జారిపోవడానికి కారణం చెప్పింది ఈరమ్మ. మొన్న చింతావోరితోటలో కల్సినప్పుడు వారమైంది నా బట్టలట్టికెళ్ళి ఇక పత్రావా అనడిగాడట బాబులురెడ్డి. మీరే అత్తరు రాసుకుంటారండీ మీ మాసిన బట్టలు మూల పారేస్తే మా పాకంతా అత్తరు వాసనే. ఆటిని తీసి ఉతక బుద్దెయ్యట్లేదు అంది ఈరమ్మ. నీక్కావాలంటే ఆ అత్తరు సీసాకాయ కొనిస్తాగానీ బట్టలు తొందరగా పత్రా అన్నాడట.

''నా ఒంటిమీద మీచేత్తో మెత్తగా రుద్ది మత్తొచ్చేదాకా మర్దనా చేసేదాకా ఉతకనంటే ఉతకను'' అనేసి వెళ్లిపోయింది ఈరమ్మ.

అలా రెండు మూడు వారాల్నుంచి అడిగినప్పుడల్లా అలాగే మాటాడి తమాషైన ఇరుకులో పెడ్తున్న ఈరమ్మని సరే రాత్రి కందపల్లి ముసలమ్మగారి పొలం మెరకమీదున్న దూళ్ళసావిట్లోకి రమ్మన్నాడు బాబులురెడ్డి.

రాత్రయింది.

వెళ్ళిన ఈరమ్మకీ జన్మలో మర్చిపోలేనన్ని వింతరుచులు చూపిస్తా నేలంతా దేకించేసేడు. మాంచి కసితో రెచ్చిపోతున్నప్పుడు ఈరమ్మ నడుం జారిపోయింది.

వింటున్న మాసరమ్మ శరీరంమీద వెంట్రుకలు పైకి లేచినియ్యి. ''ఆ బాబులురెడ్డిగారితో ఉన్నావ్ గదా నీకు కడుపు రావడం ఖాయం బుల్లీ'' నవ్వుతా అంది మాసరమ్మ.

''కడుపు తీసే మంత్రసానివి నువ్వుండగా నాకేంటి భయ్యం'' అనేసి నవ్వేసింది ఈరమ్మ.

* * *

కొన్నాళ్ళు గడిచినియ్యి.

ఆ కాకోరిసావరం అమ్మాయి శ్యామల అన్నవరం దగ్గరున్న రావికంపాడు సంబంధం చేసుకుని భర్తతో కాపురానికెళ్ళిపోయింది. అది తెల్సిన బాబులురెడ్డి ఊళ్ళోంచెళ్ళి పోయాడు.

అయిదేళ్ళు గడిచినియ్యి.

ఎక్కడెక్కడో తిరిగి మళ్ళీ ఈ మధ్యే వచ్చేడు.

సంక్రాంతి రోజులొచ్చినియ్యి.

పండక్కి మా అక్కతో పాటు దిగిపోయాడు మాఊబలంక సుబ్బులుబావ. ముక్కనుమనాడు నరాలపాలెంలో పెదరెడ్డిగారి గరువుమీద కోడిపందాల దగ్గరకెళ్తా నన్నూ తీసుకెళ్ళాడు. బాబులురెడ్డి కనిపించాడక్కడ. చాలా నీరసంగా వున్నాడు. తన కోడ్ని కూడా పందానికి తీసుకొచ్చాడట.

ముంతమామిడిచెట్టు కింద కూర్చుని మా సుబ్బులుబావా, బాబులురెడ్డి మాటాడుకుంటుంటే పంపర పనాసచెట్టు చాటునించి విన్నాను.

అత్తారింటినించి పండక్కొచ్చిన శ్యామల ''ఈ రాత్రి పుంతరేవుగట్టు కింద కర్రి సత్తిరాజుగారి పాకలోకిరా ఏవో తంటాలుపడి నేనూ అక్కడికొచ్చేస్తాను'' అని వాళ్ళపేటలో ఆడ మనిషిగైరమ్మతో కబురెట్టింది బాబులురెడ్డికి.

రాయబారం అందిన వెంటనే బాబులురెడ్డి మనసు వెన్నెలప్పుడు గోదాట్లో కోటిపల్లి రేవులోంచి ముక్తేశ్వరం రేవుదాకా ఈదినట్లయిపోయింది.

రాత్రయింది.

అసలే చలికాలం. సుళ్ళు తిరుగుతున్న గాలి చలిని బాగా పెంచుకుంటాపోతుంది.

పుంతరేవు దగ్గరున్న పాకలోపలికెళ్ళేసరికి అక్కడ మసిబట్టిన హరికెన్ లాంతరు పట్టుకుని నిలబడుంది శ్యామల. నెమ్మదిగా వెళ్ళి ఆ మనిషి ఎదురుగుండా నిలబడ్డ బాబులురెడ్డికి ఏం మాటాడాలో మాట అసలెలా మొదలెట్టాలో అర్థం గాలేదు.

కాస్సేపయ్యింది.

శ్యామలే అంది ''బాగున్నావా బాబులూ?'' అని.

''ఆ పర్లేదు'' అన్నాడు నిమ్మళంగా.

ఆ మాటా ఈ మాటా అయ్యాక తనెందుకు ఆ రోజుల్లో బాబులురెడ్డిని పెళ్ళి చేసుకోలేకపోయిందో బాగా చెప్పాక ''తేతలినారయ్య కోడలు సావిత్రికి ఈ మధ్యనే కానుపయ్యిందట గదా?'' అనడిగింది.

''అవును'' అన్నాడు.

''తల్లీబిడ్డా కుశలమేననుకుంటాను?''

''ఆ బానే ఉన్నారంట''.

''ఆసావిత్రికి కడుపు నీవల్లే వచ్చిందట గదా''.

గతుక్కుమన్న బాబులురెడ్డి కాస్త నానుస్తా ''నా వల్ల అంటే... అందులో నా తప్పేంలేదు... ఎన్నినోములు నోచినా ఎన్ని వేరుముక్కలు కట్టించుకున్నా ఎంతమంది సాధువుల దగ్గరకెళ్ళినా ఫలితం కనబడ్డం లేదంటేనీ...''అనాగాడు.

తలొంచుకుని నవ్విన శ్యామల 'మేమిప్పుడు అన్నవరంలో ఉంటన్నాం. కొండకింద చిన్న మెకానిక్ షెడ్డు పెట్టేడు మా ఆయన.

స్కూటర్లయ్యీ బాగు చేస్తుంటాడు..పెళ్ళయి అయిదేళ్ళయినా పిల్లలు పుట్టలేదు నాకు. మా ఆయనకీ మా అత్తగారికి ఇదాయికంగా పిల్లలు కావాలి. నాకిక పుట్టరని తెల్సి నన్ను చాలా చిన్నచూపు చూస్తున్నారాళ్ళు. మొగుడ్నొదిలేసి పుట్టింటికొచ్చేసిన మా ఆడపడుచు దుర్గకయితే మరీ లోకువయి పోయేను. ఆ మనిషనే సూటీపోటీ మాటలకి వెటకారాలకీ సప్త గోదావరి లో దూకి చచ్చిపోదావనిపిస్తుంది. నర్సీపట్నం దగ్గర రావికమతంలో సంబంధం చూసుకుంటున్నారు. నా భర్త రెండోపెళ్ళి తొరలోనే అన్నజోరూ...అతను నన్ను వదిలేస్తాడన్న వాతావరణం బాగా కనిపిస్తున్నాయి మా యింట్లో'' అంటా ఆగిన శ్యామల ''నేను గొడ్రాలిని గాబట్టే అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటన్నాడు. నాకే గనక కడుపొస్తే నేనే గనక గర్భిణీనయితే అతను నన్ను వదల్డు... నాకు విడాకులివ్వడు అనేసి మళ్ళా ఆగి మొదలెట్టిన శ్యామల ''గర్భం రాకపోడానికి లోపం నాలో లేదు నా మొగుళ్ళే ఉంది. అది నేనెలాగ చెప్పుకో నాళ్ళకి. కాబట్టి...కాబట్టి బాబుల్రెడ్డీ నాకో వుపకారం చేసి పెడతావా?'' అనడిగింది శ్యామల.

ఉలుకూ పలుకూ లేకుండా శ్యామలనే చూస్తున్నాడు బాబులురెడ్డి.

''కాదనకు బాబులూ... ఇది పాపం అనుకుంటున్నావేమో కాదు కాదు..సాయం'' అంది.

శ్యామల భర్తా, అత్తగారూ ముఖ్యంగా ఆడపడుచు దుర్గా అదోలాగ కదుల్తా బాబులురెడ్డి కళ్ళముందు కనపడ్తున్నారు... ''నిజమే శ్యామల చెప్పినట్టు ఇది సాయమే'' అనుకుంటూ శ్యామలని చూస్తున్నాడు.

అతని భుజం మీద చెయ్యేసిన శ్యామల దగ్గరకొచ్చింది.

పాకలో ఉన్న గడ్డిమోపు మీదికి తీసుకెళ్ళేడు ఆ మనిషిని.

ఆరోజు రాత్రే కాకండా ఓ వారం పాటు ప్రతిరాత్రీ కల్సుకుంటానే ఉన్నారు ఆళ్ళిద్దరూ. ఆ కల్సుకునేటప్పుడు కూడా శ్యామలకి సాయం చెయ్యాలి గాబట్టే శ్యామలకి నేను ఉపయోగబడాలి గాబట్టి కల్సుకుంటున్నాను అనుకుంటున్నాడు బాబులురెడ్డి.

కొన్నాళ్ళయింతర్వాత ఒక వార్త తెల్సింది బాబులురెడ్డికి.

శ్యామలకి మగకుర్రోడు పుట్టేడంట. దాంతో ఆమె మొగుడయిన ఆ మెకానిక్ షెడ్డోడు రావికమతం సంబంధం చేసుకోలేదట.

పోన్లే అనుకున్నాడు బాబులురెడ్డి.

చాన్నాళ్ళ తర్వాత కొడుకుతో పాటు పసలపూడి వచ్చిన శ్యామలని దూరంనించే చూసేడు తప్ప దగ్గరకెళ్ళి పలకరించలేదు బాబులురెడ్డి.

అతని నిజాయితీకి మనసులోనే దణ్ణంపెట్టుకుంది శ్యామల.

* * *